ఎందుకీ పక్షపాతం..?


సిరిపురంలో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి నిర్వహిస్తున్న ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు

- ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపులో జీవీఎంసీ అధికారుల వింత ధోరణి
- ప్రజలకు నిత్యావసర సరకులు విక్రయించే దుకాణాల తొలగింపు
- అనధికార ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల తొలగింపులో నిర్లక్ష్యం


22వ వార్డులో జీవీఎంసీ సిబ్బంది తొలగిస్తున్న చిరు వ్యాపారుల దుకాణాలు (ఫైల్)

రోడ్డున పడిన చిరు వ్యాపారులు

ఆదివారం వస్తే చాలు.. చికెన్, మటన్, చేపల దుకాణాలకు వెళ్లి కొనుక్కొని వస్తాం. సెలూన్ షాపునకు వెళ్లి హెయిర్ కట్ చేయించుకుంటాం..ఇంట్లోకి అవసరమైన పప్పులు, ఉప్పులు, నిత్యావసర సరకులు మన అడుగు దూరంలో ఉన్న షాపులోనే కొనుక్కుంటాం. ఇప్పుడు ఇలాంటి అవకాశం జీవీఎంసీ 22వ వార్డు ప్రజలకు లేదు. ఇక్కడ నిత్యావసర సరకులు అమ్మే దుకాణాలు, మాంసం కొట్లు, సెలూన్ షాపులను ఆక్రమణలని జీవీఎంసీ అధికారులు తొలగించారు. దీనితో ఈ వార్డు ప్రజలు ఆదివారం ఏం కావాలన్నా చాలా దూరం వెళ్లి తీసుకు రావాల్సిన పరిస్థితి నెలకొంది. 30 ఏళ్లుగా స్థానిక ప్రజలకు నిత్యావసర సరకులు అమ్ముకుంటూ జీవిస్తున్న వందలాది చిరు వ్యాపారుల కుటుంబాలను జీవీఎంసీ అధికారులు రోడ్డున పడేశారు.

బీచ్‌రోడ్డు: రహదారులు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణల తొలగింపులో జీవీఎంసీ అధికారులు పక్షపాత ధోరణి అవలంబిస్తున్నారు. ప్రజలకు నిత్యావసర సరకులు విక్రయించే చిరు వ్యాపారుల దుకాణాలను నిర్దాక్షిణ్యంగా తొలగిస్తున్న అధికారులు.. ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ప్రజలకు అనారోగ్యం, ట్రాఫిక్ ఇబ్బంది కలిగించేలా నిర్వహిస్తున్న ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల జోలికి వెళ్లడం లేదు. వార్డుకో తీరున నిబంధనలు అమలు చేస్తున్నారు. ఒక వార్డులో ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు.. మరో వార్డులో మాత్రం కనీసం హెచ్చరికలు కూడా జారీ చేయకుండా వదిలేస్తున్నారు. దీంతో ఫుట్‌పాత్‌లన్నీ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లకు అడ్డాగా మారాయి.

నడకకు ఇబ్బందులు.. ట్రాఫిక్ సమస్యలు

నగరం నడిబొడ్డున గల రామ్‌నగర్, సిరిపురం ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకుని ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు ఏర్పాటు చేశారు. పొట్టకూటి కోసం కాకుండా ధనార్జనే ధ్యేయంగా రూ.వేల జీతాలు ఇచ్చి ఇతర రాష్ట్రాల నుంచి పనివాళ్లను తీసుకొచ్చి ఈ దుకాణాలు నడుపిస్తున్నారు. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లకు ఫుడ్ సేఫ్టీ అధికారుల నుంచి ఎటువంటి అనుమతులు ఉండవు. పైగా ఇక్కడ వినియోగించే మసాలాలు, మాంసం, నూనె చాలా వరకు కల్తీతో ఉంటాయి. ఈ ఫుడ్ తినడం వల్ల ప్రజలకు అనారోగ్యం తప్ప ఏమీ ఉండదు. అటువంటి ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లను తొలగించడంలో మాత్రం జీవీఎంసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన దుకాణాల వల్ల ప్రజలకు నడిచేందుకు వీలు లేకుండా చేయడమే కాకుండా వాహనాల రాకపోకలకు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రోడ్డు మీద వాహనాలు నిలిపి ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లకు వెళ్లడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి.

వార్డుకో నిబంధన..

జీవీఎంసీ అధికారులు ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు విషయంలో వార్డుకో నిబంధన పాటిస్తున్నారు. తమకు అనుకూలంగా ఉంటే ఎంత ఆక్రమించుకున్న పర్వాలేదు.. అదే వ్యతిరేకంగా ఉంటే మాత్రం కొర్రులు చెప్పాయని.. కార్పొరేటర్ చెప్పారని ప్రజలకు అవసరమైన దుకాణాలను కూడా నిర్దాక్షిణ్యంగా తొలగిస్తున్నారు. అది కూడా ముందస్తు ఎటువంటి సమాచారం ఇవ్వకుండానే. 22వ వార్డులో ప్రజలకు ఉపయోగపడే దుకాణాలను తొలగిస్తున్న అధికారులు.. 28వ వార్డులో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి నిర్వహిస్తున్న ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లను మాత్రం వదిలేస్తున్నారు. దీంతో అధికారుల తీరుపై ప్రజలు, చిరు వ్యాపారులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

ఆక్రమణలు తొలగించాలి..

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా నిలుస్తున్న రామ్‌నగర్-సిరిపురం ప్రాంతంలోని ఫుట్‌పాత్‌లను ఆక్రమంచి ఏర్పాటు చేసిన ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, సిగరెట్లు అమ్మే షాపులను తక్షణం తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ దుకాణాలను కూడా ఇటీవలే పెద్ద సంఖ్యలో ఏర్పాటు చేశారని, ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

గడిచిన 6 నెలల వ్యవధిలోనే రామ్‌నగర్, **సిరిపురం ప్రాంతాల్లో పుట్టగొడుగుల్లా ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు పుట్టుకొచ్చాయి.** ఈ ప్రాంతంలో పెద్ద పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీలున్నాయి. దీంతో నిషేధించిన సిగరెట్ల వినియోగం పెరుగుతోంది. ఈ ప్రాంతంలో వెలుతురు సరిగా లేకపోవడం.. పక్కనే ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు ఉండటంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. మద్యం, గంజాయి సేవించిన వారి సంఖ్య పెరుగుతోంది. ఇటీవల టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిషేధిత సిగరెట్లను పెద్ద మొత్తంలో అక్కడ షాపుల్లో పట్టుకున్నారు. మూడో పట్టణ పోలీసులు ఈ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు ఉన్న ప్రాంతంలోనే మూడు కేజీల గంజాయితో ముగ్గురు యువకులను పట్టుకున్నారు.

క్లుప్తంగా

నేడు రెవెన్యూ సదస్సు

ఆరిలోవ: ఆరిలోవ గ్రామ **పరిధిలో రెండు చోట్ల** రెవెన్యూ సదస్సులు జరగ**నున్నాయి. జీవీఎంసీ** 9, 10, 11 వార్డులకు సం**బంధించిన రెవెన్యూ** సదస్సు ఈ నెల 14న **రవీంద్రనగర్ ఆఖరి** బస్టాప్ వద్ద వెంకటేశ్వర **కల్యాణ మండపంలో** నిర్వహించనున్నట్లు రూరల్ **తహసీల్దార్ పాల్** కిరణ్ శుక్రవారం ఒక **ప్రకటనలో తెలిపారు.** 12, 13 వార్డులకు సం**బంధించిన రెవెన్యూ** సదస్సు ఈ నెల 16న **టీఐసీ పాయింట్ సమీ**పాన ఆంధ్రా బ్యాంక్ (హిందీ కాలేజీ) రోడ్డులో జరగనున్నట్లు చెప్పారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సదస్సులు జరుగుతాయన్నారు. ప్రజలు రెవెన్యూకు సంబంధించిన సమస్యలపై అధికారులకు దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దార్ కోరారు.

బయోడైవర్సిటీ పార్క్‌లో విద్యార్థుల సందడి


మొక్కల విశేషాలు తెలుసుకుంటున్న కాలేజీ విద్యార్థులు

బీచ్‌రోడ్డు: చోడవరంలోని ఒక ప్రైవేటు కాలేజీకి చెందిన 30 మంది విద్యార్థులు శుక్రవారం పెదవాల్తేరులోని బయోడైవర్సిటీ పార్క్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా వారికి పార్క్ పర్యవేక్షకుడు రామామూర్తి వివిధ రకాల మొక్కల ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులంతా మొక్కలు విశేషాలు తెలుసుకుని పార్కులో సందడి చేశారు. కార్యక్రమంలో కాలేజ్ డీన్ వాసు, శేషుకుమారి పాల్గొన్నారు.

విమ్స్ సందర్శన


విమ్స్ అధికారులకు వినతిపత్రం అందిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)ను పూర్తిస్థాయి ప్రభుత్వ ఆస్పత్రిగా చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ప్రియాంక దండి పార్టీ నాయకులతో కలిసి శుక్రవారం విమ్స్‌ను సందర్శించారు. ఈ అంశంపై విమ్స్ సూపరింటెండెంట్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్య సేవలను ఉచితంగా అందించాలనే ఉద్దేశంతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విమ్స్‌ను నిర్మించారన్నారు. దీనిలో అందిస్తున్న సేవలకు ఫీజు వసూలు చేస్తుండటంతో పేదలకు భారమవుతోందని చెప్పారు. పూర్తిగా ఉచిత వైద్య సేవలు అందించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు చిన్నబాబు, మెహర్, శ్రీనివాస్, గాయత్రి, సాయి, జోగేంద్ర, వెంకటేష్ పాల్గొన్నారు.

ఘనంగా హనుమత్ వ్రతం


ప్రత్యేక అలంకరణలో ఆంజనేయ స్వామి

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్-6లోని వేంకటేశ్వర స్వామి, ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం హనుమత్ వ్రతం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ మూర్తికి పంచామృతాభిషేకం చేసి హనుమద్ తోరణాలతో అలంకరించారు. ఆలయంలోని శ్రీ తిరుమంగై ఆళ్వార్ స్వామి వార్షిక తిరునక్షత్ర సందర్భంగా స్నపన తిరు మంజనం, అలంకరణ సేవా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ పాఠ్యాంశాలు

బీచ్‌రోడ్డు: డిజిటల్ భవిష్యత్తు కోసం విద్యార్థులను సిద్ధం చేయడంలో భాగంగా రాష్ట్రంలోని ప్రభుత్వ మాధ్యమిక పాఠశాలల్లో ఏడు నుంచి తొమ్మిదో తరగతి వరకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) పాఠ్యాంశాలు ప్రవేశపెట్టనున్నట్లు క్వెస్ట్ అలయన్స్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీడ్ సమీరా తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి, క్వెస్ట్ సంస్థకు మధ్య జరిగిన ఒప్పందం గురించి శుక్రవారం మీడియాకు వివరించారు. ప్రాథమిక ఏఐ సాధనాలు, సాంకేతికతను ఉపయోగించడంలో విద్యార్థుల నైపుణ్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఏఐ పాఠ్యాంశాలు రూపొందించినట్లు చెప్పారు. అదే సమయంలో ఈ సాంకేతికతతో ప్రమాదాలు, అసమానతలను విద్యార్థులు అర్థం చేసుకున్నారని నిర్ధారించుకోవాలన్నారు. ఈ ప్రోగ్రాం విద్యార్థులు వివిధ ప్రాజెక్ట్‌ల్లో ఏఐ అప్లికేషన్లను అన్వేషించడానికి అనుమతిస్తుందని పేర్కొన్నారు. సాంకేతికత ద్వారా సృజనాత్మక వ్యక్తీకరణను ప్రోత్సహిస్తుందన్నారు.

16 నుంచి నోవోటెల్‌లో 'హాయ్ లైఫ్' ఎగ్జిబిషన్


ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించనున్న ఆభరణాలు

ఎంవీపీకాలనీ: ఈ నెల 16, 17 తేదీల్లో బీచ్ రోడ్డులోని నోవోటెల్‌లో 'హాయ్ లైఫ్' పేరిట ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు సంస్థ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రసిద్ధ బ్రాండ్‌లకు చెందిన మగువలు మెచ్చే అద్భుత ఆభరణాలు, గృహాలంకరణలు, పెళ్లి దుస్తులు ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. లగ్జరీ, గ్లామర్ వేడుకల కోసం అందుబాటులో ఉన్న ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు విశాఖ నగరవాసులు ఎగ్జిబిషన్‌ను సందర్శించాలని కోరారు. వినియోగదారుల కోసం ప్రత్యేక ఆఫర్లు కూడా అందిస్తున్నట్లు చెప్పారు.

ఏయూ వాలీబాల్ జట్టు ఎంపిక


ఏయూ వాలీబాల్ జట్టు సభ్యులతో ఆచార్య విజయమోహన్

విశాఖ విద్య: అంతర్ యూనివర్సిటీ పురుషుల వాలీబాల్ పోటీలు ఈ నెల 18 నుంచి 22 వరకు కేరళలో జరగనున్నాయి. ఆంధ్రా యూనివర్సిటీ నుంచి పాల్గొనే జట్టు క్రీడాకారులను శుక్రవారం ఎంపిక చేశారు. ఏయూ తరఫున ఇంటర్ యూనివర్సిటీ కాంపిటీషన్‌కు ఆడే జట్టు సభ్యులను స్పోర్ట్స్ బోర్డ్ డైరెక్టర్ ఆచార్య ఎన్.విజయమోహన్ అభినందించారు. కేరళలో జరిగే పోటీల్లో విజేతలుగా నిలిచి ఏయూ ప్రతిష్టను ఇనుమడింపజేసేలా సిద్ధం కావాలని ఆకాంక్షించారు.

సీపీఎం మహాసభలను జయప్రదం చేయండి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

ఆరిలోవ: ఈ నెల 28, 29 తేదీల్లో పెందుర్తిలో జరగనున్న సీపీఎం జిల్లా మహాసభలను ప్రజలు జయప్రదం చేయాలని పార్టీ మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు కోరారు. ఆరిలోవ సీపీఎం కార్యాలయంలో శుక్రవారం మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు, ప్రజా సమస్యలపై సీపీఎం పోరాడుతోందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు గడవకముందే రూ.17 వేల కోట్లు విద్యుత్ చార్జీలు వేసిందన్నారు. ప్రజా సమస్యలపై ఈ సభలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు నరేంద్రకుమార్, శంకరరావు, నాగరాజు, కాంతం, నాయుడు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన యువకుడి మృతి

బీచ్‌రోడ్డు: మానసిక పరిస్థితి బాగోలేక ఆత్మహత్యకు యత్నించిన ఓ యువకుడు శుక్రవారం మృతిచెందాడు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా.. రేసపువానిపాలేనికి చెందిన సురేష్‌కుమార్(29) పుట్టుకతో చెవుడు, మూగ. ఇటీవల కాలంలో అతడి మానసిక పరిస్థితి కూడా బాగోలేదు. దీంతో ఈ నెల 1న ఇంట్లో కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. ఇంట్లో మంటలు రావడంతో తల్లి అప్రమత్తమై ఆస్పత్రికి తరలించింది. చికిత్స పొందుతూ శుక్రవారం సురేష్‌కుమార్ మరణించాడు. ఈ ఘటనపై యువకుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

దుర్గమ్మకు కానుకగా బంగారు మంగళసూత్రాలు


మంగళసూత్రాలు


దాతలకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారి

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు వైజాగ్‌కు చెందిన భక్తులు శుక్రవారం బంగారు మంగళసూత్రాలను కానుకగా సమర్పించారు. వైజాగ్ హెచ్‌బీ కాలనీకి చెందిన ఏవీ శ్రీనివాస్ కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఈ సందర్భంగా ఆలయ అధికారులను కలిసి సుమారు 25 గ్రాముల బంగారంతో తయారు చేసిన రెండు సూత్రాలను అందజేసింది. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను బహూకరించారు.

శతాధిక వృద్ధురాలి మృతి



అప్పయ్యమ్మ (ఫైల్)

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డుకు చెందిన శతాధిక వృద్ధురాలు మృతి చెందారు. వార్డులోని పితానిదిబ్బ ప్రాంతంలో నివసిస్తున్న పల్లా అప్పయ్యమ్మ(103) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆరోగ్యం క్షీణించడంతో శుక్రవారం ఆమె ఇంటి వద్ద మరణించారు. అప్పయ్యమ్మకు 11 మంది సంతానం. తన మునిమనవళ్ల ఆలనా.. పాలన కూడా చూశారు.

12వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డులో పలు అభివృద్ధి పనులకు శుక్రవారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, కార్పొరేటర్ అక్కరమాని రోహిణి శంకుస్థాపన చేశారు. పెదగదిలిలో రజకులకు సామాజిక భవనం, పెదగదిలి, సాలిపేట ప్రాంతాల కొండవాలులో పలుచోట్ల రక్షణ గోడలను రూ.58 లక్షలతో నిర్మించనున్నట్లు ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో జీవీఎంసీ వర్క్స్ డీఈ అప్పారావు, ఏఈ వెంకటరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పదో తరగతిలో సత్ఫలితాలకు వంద రోజుల ప్రణాళిక


ఆనందపురం జెడ్పీ హైస్కూల్‌లో మాట్లాడుతున్న డీఈవో ప్రేమ్‌కుమార్

తగరపువలస: పదో తరగతి విద్యార్థులకు వంద రోజుల ప్రణాళిక అమలు చేసి అభ్యసనా సామర్థ్యాలను మెరుగు పరచాలని డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ సూచించారు. శుక్రవారం ఆయన ఆనందపురం జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. మెరుగైన ఫలితాలు సాధించడానికి సూచనలు చేశారు. టాయిలెట్లు, పాఠశాల రిజిస్టర్లు పరిశీలించి సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో కూడా ఉపాధ్యాయులు ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ, మరమ్మతులపై అవగాహన


సదస్సు ప్రారంభిస్తున్న అతిథులు

ఎంవీపీకాలనీ: ఇంటర్నేషనల్ కాపర్ అసోసియేషన్ ఇండియా(ఐసీఏఐ), ఇండియన్ ట్రాన్స్‌ఫార్మర్ మ్యానిఫ్యాక్చరర్స్ అసోసియేషన్ సంయుక్తంగా డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ రిపేర్, ఆపరేషన్, నిర్వహణ కోడ్ ఆఫ్ ప్రాక్టీసెస్ అంశంపై సదస్సు నిర్వహించారు. ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలోని సెమినార్ హాల్‌లో శుక్రవారం ఈ కార్యక్రమం జరిగింది. అతిథులు షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ గ్రూప్ సీఈవో(ఐటీఎంఏ సభ్యుడు), ఐసీఏఐ ఎనర్జీ రెగ్యులేటరీ వ్యవహారాల సలహాదారు మనస్ కుందు, ఏపీఈపీడీసీఎల్ డైరెక్టర్(ఆపరేషన్స్, చీఫ్ జనరల్ మేనేజర్) వి.విజయలలిత తదితరులు జ్యోతి వెలిగించి సదస్సు ప్రారంభించారు. ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలు, మరమ్మతులు, నిర్వహణ ఖర్చులు వంటి పలు అంశాలపై విద్యుత్ రంగానికి చెందిన నిపుణులు అవగాహన కల్పించారు.

నేటి నుంచి జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు


విద్యుత్ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ శ్యాంబాబు

మహారాణిపేట: జిల్లాలో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఏపీఈపీడీసీఎల్ జిల్లా పర్యవేక్షక ఇంజినీర్ జి.శ్యాంబాబు శుక్రవారం విద్యుత్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లా ప్రధాన కేంద్రం, డివిజన్ కేంద్రాల్లో ఈ నెల 20న విద్యుత్ పొదుపుపై అవగాహన ర్యాలీలు నిర్వహించనున్నామని ఆయన తెలిపారు. కలెక్టర్ హరేందిర ప్రసాద్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఇంధన పొదుపుపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తామన్నారు. స్వయం సహాయక మహిళా బృందాలకు ఇంధన సంరక్షణ పద్ధతులు, స్టార్ రేటింగ్ గృహోపకరణాల ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తామని చెప్పారు. విద్యుత్ పొదుపు ఆవశ్యకత, నూతన సాంకేతిక విజ్ఞానం అనే అంశంపై నిష్ణాతులతో ఇంజినీరింగ్ కాలేజీల్లో వర్క్‌షాప్‌లు నిర్వహిస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జానపద కళాకారులు, జన విజ్ఞాన వేదిక కార్యకర్తలతో ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.సింహాచలం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రాష్ట్ర హస్త కళలు, సాంస్కృతిక సంఘం చైర్‌పర్సన్ మంజులా రెడ్డి

పీఎం పాలెం: శిల్పారామంలో చేనేత వస్త్ర మేళాను స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, స్టాల్స్‌ను రాష్ట్ర హస్త కళలు, సాంస్కృతిక సంఘం చైర్‌పర్సన్ సీహెచ్ మంజుల రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. భారత ప్రభుత్వం అభివృద్ధి కమిషనర్ చేనేత, న్యూఢిల్లీ వారి సౌజన్యంతో ఈ చేనేత వస్త్ర ప్రదర్శన నిర్వహిస్తున్నారు. మంగళగిరి, పోచంపల్లి, వెంకటగిరి, ధర్మవరం, గద్వాల్ తదితర ప్రాంతాల్లో తయారైన చేనేత వస్త్రాలు మార్కెట్ ధరల కంటే తక్కువకే స్టాల్స్‌లో లభిస్తాయని నిర్వాహకులు తెలిపారు. ఈ స్టాల్స్ ఈ నెల 26వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర శిల్పారామాల ముఖ్య కార్య నిర్వాహక అధికారి వి.స్వామినాయుడు, 8వ వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు స్థానిక పరిపాలన అధికారి టి.విశ్వనాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యావంతులు కావాలి

సీతమ్మధార: విద్యార్థులు చక్కగా చదవుకుని ఉన్నత విద్యావంతులు కావాలని డీఈవో ప్రేమ్‌కుమార్ సూచించారు. శుక్రవారం ఉదయం 9.30 గంటలకు సీతమ్మధార పీ అండ్ టీ కాలనీలోని జీవీఎంసీ ప్రాథమిక ఉన్నత పాఠశాల ప్లస్ (ఎస్ఎంసీహెచ్)ను అకస్మాత్తుగా సందర్శించారు. పదో తరగతి విద్యార్థుల గదికి వెళ్లి సబ్జెక్టుల వారీగా సిలబస్‌ను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల విషయ నైపుణ్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి, ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఇంజినీరింగ్, మెడిసన్ చేయా లని సూచించారు. తల్లిదండ్రులకు, ఉపాధ్యాయుల కు మంచి పేరు తేవాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం డి.రాంప్రసాద్ పాల్గొన్నారు.

పుస్తక పఠనంపై విస్తృత ప్రచారం అవసరం


కవులకు జ్ఞాపికలు అందజేస్తున్న డాక్టర్ కూటికుప్పల సూర్యారావు

మహారాణిపేట: ప్రస్తుత కంప్యూటర్ యుగంలో పుస్తక పఠనంపై నిర్లక్ష్యం పెరుగుతోందని, దీని నుంచి గట్టెక్కాలంటే విస్తృత ప్రచారం జరగాలని పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ కూటికుప్పల సూర్యారావు అన్నారు. అరసం విశాఖ జిల్లా సమితి ఆధ్వర్యంలో విశాలాంధ్ర విశాఖ 23వ పుస్తక మహోత్సవ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన కవి సమ్మేళనంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. సమాజంలోని కవులందరూ సామాజిక స్పృహతో మెలిగి వాస్తవ పరిస్థితులను ప్రజలకు అందవేయడానికి ముందుకు రావాలని ఆకాంక్షించారు. ఆత్మీయ అతిథి డాక్టర్ మాటూరి శ్రీనివాసరావు, కవులు ఎస్.హనుమంతరావు, అడపా రామకృష్ణ, రత్నరాజు, ఫ్రాన్సిస్, బి.కూర్మారావు, బి.రాధారాణి, సత్యవాడ సోదరీమణులు, కె.వి.ఎస్.మూర్తి, స్వర్ణ శైలజ, బసు పోతన భీమేశ్వరరావు, పరమేశ్వరరావు తదితర కవులు పాల్గొని వారి కవితలు చదివి వినిపించారు. అనంతరం కవులందరికీ కూటికుప్పల సూర్యారావు జ్ఞాపికలు అందించి ఘనంగా సన్మానించారు.